
సాక్షి
బాపట్ల

బుధవారం । 27 । ఆగస్టు । 2025



పాఠశాలలకు ఫర్నిచర్ వితరణ

మంగళగిరిటౌన్: నగర పరిధిలోని పలు పాఠశాలలకు రూ.1.75లక్షల విలువైన బీరువాలు, టేబుళ్లు, కుర్చీలను మంగళవారం ఐడీబీఐ బ్యాంక్ ఆధ్వర్యంలో అందజేశారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1,28,831 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా.. దిగువకు 1,15,832 క్యూసెక్కులు వదులుతున్నారు.



పశ్చిమ డెల్టాకు నీరు విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి 8,216 క్యూసెక్కులు మంగళవారం విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. బ్యారేజీ వద్ద 12 అడుగులు నీటి మట్టం ఉంది.

పూజలందుకో.. వి(శ్వ)నాయకా

- వాడవాడలా మండపాల ఏర్పాటు
- మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు
- పూజా సామగ్రి కొనుగోలుకు భక్తుల రాక
- కిక్కిరిసిన మార్కెట్ వీధులు



బాపట్లలో పత్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

బాపట్ల అర్బన్: సకల లోకాలకు ఆది పూజ్యుడైన వినాయకుడు వాడవాడలా ఠీవిగా కొలువుదీరారు. జై వినాయకా.. జైజై విశ్వనాయకా అంటూ గణనాథుడ్ని ఆరాధించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన పత్రి, ఇతర పూజాసామగ్రి కొనుగోలుతో బాపట్ల పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గణనాథుడి పూజకు అవసరమైన పూజా ద్రవ్యాల సేకరణలో భక్తులు నిమగ్నమయ్యారు. వినాయకచవితి సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథుడి మండపాలు ఏర్పాటు చేశారు. ఆ మండపాల్లో ఇప్పటికే వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పూజించేందుకు సకల ఏర్పాట్లు చేసుకున్నారు. వినాయక చవితి పండుగ ఆధ్యాత్మికతతోపాటు సమైక్యతకు చిహ్నంగా నిలుస్తుంది.

వివిధ ఆకృతుల్లో విగ్రహాల ఏర్పాట్లు

బాపట్ల పట్టణంలోని ప్రతి వీధిలో ఒకటి, అంతకు మించి వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఆయా వీధుల్లోని ప్రజలకు చందాలు వేసుకుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేందుక సిద్ధమయ్యారు. ప్రజలు వారి వారి స్థోమతను బట్టి విగ్రహాలు కొనుగోలు చేశారు,. వీటిని పందిళ్లలోకి తరలిస్తుండడంతో పట్టణంలో రద్దీ నెలకొంది.

పూజా సామగ్రికి డిమాండ్

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని రథం బజార్ సెంటర్, మార్కెట్ సెంటర్, చీలు రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో గణేశుని పూజా సామగ్రి విక్రయాలు ప్రారంభించారు. పత్రికి అవసరమైన వెలగపండు, అరటి బోదెలు, పండ్లు వంటివి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పూజా సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయని భక్తులు చెబుతున్నారు. గతంలోకంటే 50 శాతం ధరలు పెరిగాయని అంటున్నారు. భక్తుల కొనుగోలుతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారాయి.

గ్రామాల్లో చవితి సందడి

రేపల్లె: పట్టణాలు, గ్రామాల్లో వినాయక చవితి సందడి నెలకొంది. పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన మండపాలలో గణనాథులు కొలువుదీరుతున్నారు. వినాయక ప్రతిమలు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు రావడంతో పట్టణాలలో వీధులన్నీ రద్దీగా మారాయి. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో వినాయకుని మట్టి ప్రతిమలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. రేపల్లె పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్, రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్లలో ఏర్పాటుచేసిన వినాయకుడు, పూజా సామాగ్రి స్టాల్స్ ప్రజలతో కళకళలాడాయి.



రేపల్లెలో ఆకర్షణీయంగా మట్టి విగ్రహాలు



రేపల్లెలోని రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్ వద్ద..

మట్టి ప్రతిమలకే అధిక ప్రాధాన్యం

బాపట్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో వినాయక మట్టి ప్రతిమలు విక్రయిస్తున్నారు. ప్రాడిజి విద్యాలయంలో విద్యార్థులతో మట్టివినాయకులను తయారు చేయించి పంపిణీ చేశారు. విద్యార్థులు అధిక శాతం మట్టి విగ్రహాల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. మట్టి విగ్రహాల ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చని అంటున్నారు.



ఉచితంగా పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న మట్టి వినాయకుని ప్రతిమలు

విద్యుత్ వెలుగుల్లో మండపాలు



కొల్లూరు లాక్ సెంటర్ వినాయకుడి ఆలయం వద్ద విద్యుత్ దీప కాంతులు

కొల్లూరు: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలోని పలు గ్రామాలలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలు ప్రతిష్ఠించే పనిలో కమిటీ నిర్వాహకులు నిమగ్నమయ్యారు. కొల్లూరు లాక్ సెంటర్‌లోని వినాయకుడి ఆలయంతోపాటు, పలు వినాయక మండపాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు వెలుగులు ఆకట్టుకునే విధంగా ఉన్నాయి.

న్యూస్‌రీల్

ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకోండి

–జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: జిల్లా ప్రజలు శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ పేర్కొన్నారు. జిల్లా ప్రజలకు వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ బుధవారం జరగబోయే వినాయక చవితి పర్వదినాన్ని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య, మతసామరస్యాన్ని పాటిస్తూ ఘనంగా జరుపుకోవాలని సూచించారు. ఈ వినాయక చతుర్థి ప్రతి ఒక్కరి జీవితాల్లో సకల శుభాలు కలిగించాలని, ఎటువంటి విఘాతం లేకుండా ప్రజలు తలపెట్టిన కార్యాలు సాఫల్యం పొందాలని, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పబ్లిక్ ప్రదేశాలలో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని, పోలీసు శాఖ సూచనలు పాటించాలని అన్నారు. .

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఆల్మాస్‌కు బ్రాంజ్ మెడల్



మంగళగిరి: పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన సాదియా ఆల్మాస్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటింది. ప్రపంచ జూనియర్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్–2025 పోటీల్లో బ్రాంచ్ మెడల్ సాధించింది. ఈనెల 24వ తేదీ నుంచి సెప్టెంబర్ 3 వరకు సంజోష్ జిల్లా కోస్టారికాలో పోటీలు జరుగుతున్నాయి. ఇందులో స్క్వాట్ 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 100 కేజీలు, డెడ్ లిఫ్ట్ 105 కేజీలు (సిల్వర్ మెడల్) కలిపి మొత్తం 470 కేజీల బరువు ఎత్తి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మకుల విజయభాస్కర రావు, షేక్ సంధాని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా అసోసియేషన్‌లు ఆల్మాస్‌ను అభినందించినట్లు పేర్కొన్నారు.

రైల్వేలపై సమస్యలు ఉంటే తెలియజేయండి !

జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యులు ఆతుకూరి ఆంజనేయులు



నగరంపాలెం: సికింద్రాబాద్ రైల్వే నిలయంలో వచ్చే నెల 3న జోనల్ రైల్వే యూజర్స్ కన్జూమర్ కమిటీ (జెడ్‌ఆర్‌యూసీసీ) సమావేశం జరగనున్నట్లు సభ్యులు, ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ శాశ్వత అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. జిన్నా టవర్ కూడలిలోని ది ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గుంటూరు రైల్వేస్టేషన్, న్యూ గుంటూరు రైల్వే స్టేషన్, నంబూరు రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయాలని కోరుతూ ఇప్పటికే లేఖల ద్వారా దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు తెలియజేశానని ఆయన పేర్కొన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రధాన రైల్వేస్టేషన్లలో ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. రైల్వే పరంగా ఏవైనా సమస్యలు ఉన్నట్లైతే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వచ్చే నెల 3న జరిగే సమావేశంలో మాట్లాడతానని ఆంజనేయులు తెలిపారు. సమావేశంలో కామర్స్ ఉపాధ్యక్షుడు ఆతుకూరి నగేష్, సభ్యులు కాశీ వెంకటరాంబాబు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో పలు అనర్థాలు



గుంటూరు లీగల్: బాల్య వివాహాలతో పలు అనర్థాలు జరుగుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ తెలిపారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు మంగళవారం శ్యామలానగర్ బంజారా కాలనీలో బాల్య వివాహాలు, గిరిజన మహిళల్లో ఎర్లీ ప్రెగ్నన్సీపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండని ఆడ పిల్లలకు, 21 సంవత్సరాలు నిండని మగపిల్లలకు వివాహం చేయరాదని, అది చట్టపరంగా నేరమని తెలిపారు. ఆ వయస్సులో వారు మానసికంగా, శారీరకంగా వివాహానికి సిద్ధంగా ఉండరని చెప్పారు. ఈ సమయంలో చదువుకోవడం ముఖ్యమని సూచించారు.

గణేషుని నిమజ్జనాలు పకడ్బందీగా చేయాలి

చీరాల ఆర్డీఓ చంద్రశేఖర్



చీరాల టౌన్: వినాయక చవితి పురస్కరించుకుని నియోజకవర్గంలోని వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాల్లో జరిగే గణపతి నిమజ్జనోత్సవాల్లో అపశ్రుతులు జరగకుండా ప్రశాంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చీరాల ఆర్డీఓ తూమాటి చంద్రశేఖర నాయుడు సూచించారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో పోలీస్, రెవెన్యూ, ఫైర్, మెడికల్, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, మెరైన్, మున్సిపల్ అధికారులతో ఆర్డీఓ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ చీరాల నియోజకవర్గంతోపాటు పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నరసరావుపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను.. నిమజ్జనం కోసం వాడరేవు, రామాపురం సముద్ర తీర ప్రాంతాలకు తీసుకువస్తారన్నారు. విగ్రహాల తోపాటు అధిక సంఖ్యలో భక్తులు వాడరేవులో స్నానాలు చేస్తారన్నారు. సముద్రంలో లోతుకు వెళ్లి గల్లంతు కావడం, ప్రాణ నష్టం జరగకుండా కఠినంగా వ్యవహరించాలని సూచించారు. తీరం ఒడ్డున ప్రత్యేక అవుట్ పోస్టు, పోలీసులు, గజ ఈతగాళ్లు, మెడికల్ కిట్లు, 108 అంబులెన్స్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చేసేందుకు ట్రాఫిక్ సిబ్బందిని, బారికేడ్లు, విద్యుత్ లైట్లు, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయాలన్నారు. తీరప్రాంతంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేయడంతోపాటు బ్లీచింగ్ చల్లించి చెట్లు తొలగించాలన్నారు. నిమజ్జనాల్లో ప్రాణ, ధన, ఆస్తి నష్టాలు జరగకుండా పని చేయాలని కోరారు. ఉన్నతాధికారుల ఆదేశాలు విధిగా పాటించి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిపించాలని తెలిపారు. చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్, తహసీల్దార్ కె.గోపికృష్ణ, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, ఎంపీడీవోలు శివన్నారాయణ, రాజేష్, సీఐలు, ఎస్సైలు, మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేను రాను బాస్ చుండూరు స్టేషన్‌కు..

- ఆసక్తి చూపని ఎస్ఐలు
- నాలుగు నెలలుగా ఖాళీ
- మండలంలో రేషన్ మాఫియా, గంజాయి, పేకాట జోరు



చుండూరు పోలీసుస్టేషన్

వేమూరు: చుండూరు పోలీసు స్టేషన్ పేరు చెబితే జిల్లాలోని ఎస్ఐలు భయపడుతున్నారు. అక్కడ విధి నిర్వహణ కత్తిమీద సాములా మారింది. రేషన్ బియ్యం మాఫీయా, గంజాయి ముఠా పోలీసులను శాసిస్తున్నారు. తమకు అనుకూలంగా నడుచుకోవాలని లేకుంటే బదిలీ తప్పదని హెచ్చరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 14 నెలల కాలంలో నలుగురు ఎస్ఐలు బదిలీ అయ్యారు. దీంతో ఈ స్టేషన్‌లో పనిచేసేందుకు ఎవ్వరూ ముందుకు రావడంలేదు. నాలుగు నెలలుగా ఎస్ఐ పోస్టు ఖాళీగా ఉంది. స్టేషన్ పరిధిలో శాంతిభద్రత నిర్వహణ కష్టతరంగా మారింది. వేమూరు నియోజకవర్గం పరిధిలో వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు పోలీసుస్టేషన్లు ఉన్నాయి. వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు పోలీసుస్టేషన్లకు ఎస్ఐ ఉన్నారు. చుండూరు స్టేషన్ ఎస్ఐ పోస్టు మాత్రం ఖాళీగా ఉంది.

మాఫియాకు ఎదురు తిరిగితే బదిలీయే..

చుండూరు మండలంలో రేషన్ మాఫియా, గంజాయి అమ్మకాలు, పేకాట జోరుగా సాగుతుంది. చుండూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నాడు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు మండలాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి నడిగడ్డ వారిపాలెంలో ఉన్న రైస్ మిల్లుకు తరలిస్తున్నారు. అక్కడ పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. గంజాయి వ్యాపారం జోరుగా సాగుతుంది. కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిమ్మ తోటల్లో పేకాట జోరుగా నిర్వహిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ ఎస్ఐ గంజాయి, పేకాట నిర్వహణపై ఉక్కుపాదం మోపారు. దీంతో కూటమి నేతలు ఆగ్రహించారు. ఆ ఎస్ఐపై బదిలీ వేటు పడింది. ఆ తర్వాత వచ్చిన ఎస్ఐ కూడా పేకాట నిర్వాహకులపై దృష్టి సారించారు. మే నెల 19వ తేదీన నిమ్మ తోటలో పేకాట ఆడుతున్న వ్యక్తులను గుర్తించేందుకు డ్రోన్‌లు ఉపయోగించారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. కూటమి నేతల ఆగ్రహానికి గురయ్యారు. ఎస్ఐని బదిలీ చేయించారు. అప్పటి నుంచి చుండూరు పోలీసుస్టేషన్‌కు రావాలంటే ఎస్ఐలు భయపడుతున్నారు. దీంతో ఎస్ఐ పోస్టు నాలుగు నెలలుగా ఖాళీగా ఉంది. అక్రమ రేషన్ బియ్యం జోలికి వెళ్ల వద్దని తహసీల్దార్‌కు కూటమి నేతలు ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. దీంతో తహసీల్దార్ అటు కన్నెత్తి చూడడం లేదు. అక్రమ రేషన్ బియ్యం పట్టుకున్న దాఖలాలు లేవు. దీనిపై చుండూరు సీఐ శ్రీనివాసరావును వివరణ కోరగా పలువురు శిక్షణ పొందుతున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఎస్ఐలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అప్పటి వరకు శాంతిభద్రతలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నామని చెప్పారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పొగాకు కొనుగోలు

- రైతులకు కావలసిన ఎరువులు సిద్ధంగా ఉంచాలి
- విద్యార్థులకు రుచిగా, శుచిగా భోజనం వడ్డించాలి
- చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



కర్లపాలెం ఎఫ్‌సీఐ గోదాముల వద్ద పొగాకు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటమురళి

కర్లపాలెం: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పొగాకు కొనుగోలు చేస్తామని, రైతులు అధైర్య పడవద్దని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి అధికారులతో కలసి మంగళవారం కర్లపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత జిల్లా కలెక్టర్ కర్లపాలెంలోని ఎఫ్‌సీఐ గోదాముల్లో ఏర్పాటుచేసిన పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు అమ్మకానికి తీసుకువచ్చిన పొగాకును పరిశీలించారు. పొగాకు రైతులు మాట్లాడుతూ నాణ్యతగా ఉన్న పొగాకుకు కూడా నాసిరకం పొగాకుకు ఇచ్చే ధర నిర్ణయించి కొనుగోలు చేస్తున్నారని, దీని వల్ల తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కలెక్టర్ పొగాకు ధరలు నిర్ణయించేందుకు అనుభవం ఉన్న బయ్యర్లను నియమించి రైతులకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. పొగాకు నాణ్యత, కొనుగోళ్లకు సంబంధించి బయ్యర్లను అవసరం మేరకు శిక్షణకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.

ఎరువులు సిద్ధంగా ఉంచాలి.

ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. కర్లపాలెం సెంటర్‌లో ఉన్న మన గ్రోమోర్ కేంద్రాన్ని, యాజలి గ్రామంలోని రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం కార్యాలయాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. మన గ్రోమోర్ సెంటర్‌లో రికార్డులు పరిశీలించారు. అనంతరం గోదాములో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని కలెక్టర్ రైతులకు సూచించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న కలెక్టర్, ఆర్డీవో

యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలు జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి కలెక్టర్ భోజనం చేశారు. భవిష్యత్‌లో ఏం కావాలనుకుంటున్నారని కలెక్టర్ విద్యార్థులను ప్రశ్నించారు. ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా చదివి కలలు నెరవేర్చుకోవాలని ఆయన చెప్పారు.

అధికారులపై అసహనం

యాజలి గ్రామంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను పరిశీలించిన కలెక్టర్ క్షేత్రస్థాయిలో పనిచేసే సర్వే సిబ్బంది పనితీరు సరిగా లేదని అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలా అని అసహనం వ్యక్తం చేశారు. కర్లపాలెం పంచాయతీ పరిధిలోని ఎంవిరాజుపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రీ స్కూల్ నిర్వహణపై ఆరా తీశారు. చిన్నారులందరికీ పౌష్టికాహారం సక్రమంగా అందించాలని చెప్పారు. అడిగిన ప్రశ్నలకు చిన్నారులు సరిగా స్పందించకపోటంతో కలెక్టర్ కార్యకర్తపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమాలలో బాపట్ల ఆర్డీవో పి.గ్లోరియా, వ్యవసాయశాఖ ఏడీ అన్నపూర్ణ, డీపీవో ప్రభాకర్‌రావు, మార్క్‌ఫెడ్ ఏడీ కరుణశ్రీ, సీడీపీవో రాధామాధవి, డీఎంఅండ్ హెచ్‌వో విజయమ్మ, తహసీల్దార్ షాకీర్ పాషా, ఇన్‌చార్జి ఎంపీడీవో అయినంపూడి శ్రీనివాసరావు, ట్రైనింగ్ ఎస్ఐ నజీమా తదితరులు ఉన్నారు.

అమెరికా సుంకాలతో ఆక్వాకు ముప్పు

రౌండ్ టేబుల్ సమావేశంలో రైతుల ఆవేదన



మాట్లాడుతున్న ఆక్వా రైతు సంఘం అధ్యక్షుడు తేళ్ల రామయ్య

వేటపాలెం: అమెరికా.. భారత్‌పై విధించిన సుంకాలు ఆక్వా రంగానికి పెను ముప్పుగా తయారయ్యాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. 'ట్రంప్ సుంకాలు– ఆక్వా రంగంపై ప్రభావం' అనే అంశంపై రామన్నపేట పంచాయతీ.. రావూరిపేట శివారులోగల ఆక్వా అసోసియేషన్ కార్యాలయంలో ఆక్వా రైతు సంఘం ఆధ్వర్యాన మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆక్వా అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్ల రామయ్య అధ్యక్షత వహించారు. కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమెరికా ఆంక్షలను తిప్పి కొట్టాలని డిమాండ్ చేశారు. సుంకాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ప్రస్తుతం ఆక్వా రంగం కష్టకాలంలో ఉందన్నారు. ఆక్వా రంగాన్ని, వ్యవసాయ రంగంగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమెరికా మన దేశ ఎగుమతులపై భారీ సుంకాలు విధించడం వల్ల వ్యవసాయం, అనుబంధ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మరోవైపు సుంకాలు అమలు ప్రారంభం కాకపోయినా రాష్ట్రంలో వ్యాపారులు అన్ని కౌంట్ రొయ్యల ధరలు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతలు సక్రమంగా నిర్వహించడం లేదని విమర్శించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తేళ్ల రామయ్య మాట్లాడుతూ రొయ్యల కొనుగోలు, ఫీడ్ తయారీ.. పిల్ల సప్‌లై కంపెనీలు వివిధ రాజకీయ నాయకుల కనుసన్నల్లో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు వారితోనే చర్చలు, సంప్రదింపులు జరిపి సామాన్య రైతులకు గిట్టుబాటు ధరలు రాకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమంచి స్వాములు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా రైతులకు విద్యుత్ యూనిట్ ధర రూపాయిన్నర తగ్గించాలని, ఈ రంగంపై వేస్తున్న భారాలను తగ్గించాలని, ఫీడ్ ముడి పదార్థ ధరలు తగ్గించాలని కోరారు. రొయ్యల ధరలు నిర్దిష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆక్వా రైతు పల్లపోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశీయ మార్కెట్‌ను పెంచుకునే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. మధ్యాహ్న భోజనం పథకం, హాస్టల్స్ మిలిటర్ మెనూలో రొయ్యలను చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు సూర్యనారాయణ, ప్రకాశం జిల్లా సంఘం అధ్యక్షుడు జె.జయంతిబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తలపల రామారావు, కౌలు రైతు సంఘం కార్యదర్శి పి.కొండయ్య, చీరాల డివిజన్ సీఐటీయూ నాయకులు నలతోటి బాబూరావు, మండల నాయకులు మచ్చా అయ్యప్పరెడ్డి, రొయ్యల రైతులు రాంబాబు, జరుగు రమేష్, జగదీష్, ముంగర వెంకటరామయ్య, మోటుపల్లి శంకర్, మద్దినేని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,500 గరిష్ఠం : రూ. 2,100

మోడల్ ధర రూ. 1,800

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	60,157
అమ్మకాలు	58,321
నిల్వ	11,337

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-14,500
నంబరు-5	10,000-13,500
341	10,000-15,300
సూపర్-10	10,000-13,800

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-14,000
నంబరు-5	10,000-13,600
341	11,000-15,400
4884	10,000-13,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,000 - 14,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,000
ఆర్మూర్	9,800 - 12,000
తాలుకాయలు	6,000 - 7,600

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,300
బాడిగ - 355	10,000-14,000
దేవనూరు డీలక్స్	10,500-13,600
తాలు	5,200 - 7,300

-కొరిటెపాడు (గుంటూరు)

రాష్ట్రంలో రెడ్‌బుక్ అరాచక పాలన

- వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజం
- గుంటూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్‌కు మాజీ ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డితో కలసి పరామర్శ
- పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేపట్టాలని డిమాండ్



వెంకటప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లు గాయాలను పరిశీలిస్తున్న అంబటి రాంబాబు, డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా, నేతలు

నెహ్రూనగర్(గుంటూరుఈస్ట్): రాష్ట్రంలో నారా లోకేష్ రెడ్ బుక్ అరాచక పాలన నడుస్తోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో వైఎస్సార్ సీపీ నేతలు ఆసుపత్రులు, జైళ్లు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగడం సరిపోతోందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గం టి. అన్నవరంలో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి, గుంటూరులోని ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్‌ను మంగళవారం పార్టీ పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుతో కలిసి పరామర్శించారు. దాడిలో వెంకట ప్రసాద్ సోదరుడు వెంకటేశ్వర్లుకు అయిన గాయాలను పరిశీలించారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా వెంకట ప్రసాద్ పని చేయడంతో అతడిని అంతం చేయాలని ప్లాన్ చేశారని ఆరోపించారు. ఈ కేసులో పోలీసులు సింపుల్‌గా 324 కేసు వేశారని తెలిపారు. రాజీపడమని నోటీసులు తీసుకునే సింపుల్ కేసు నమోదు చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థ కూటమి ప్రభుత్వానికి తొత్తుగా పని చేస్తోందని విమర్శించారు. న్యూట్రల్‌గా ఉండాల్సిన పోలీసులు అధికార పార్టీకి ఏకపక్షంగా పని చేస్తున్నారని ఆరోపించారు. నారా లోకేష్ రెడ్ బుక్ ఎల్లకాలం ఉండదని, రానున్న రోజుల్లో వేరే బుక్కులు వస్తాయనే విషయాన్ని ఆయన గుర్తు పెట్టుకోవాలని హితవు పలికారు. మాచర్లలో రెండు టీడీపీ ముఠాలు కొట్టుకొని హత్యలు చేసుకుంటే, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లోనే వినుకొండలో రషీద్ అనే వైఎస్సార్ సీపీ కార్యకర్తను అతి కిరాతకంగా నరికి చంపారని తెలిపారు. రాష్ట్రంలో ఇంత అరాచకాలు జరుగుతున్నా డీజీపీ, ఎస్పీలు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలపై పెట్టే అక్రమ కేసులపై న్యాయస్థానాల ద్వారా పోరాటం చేస్తామని తెలిపారు.

బాధితుడు పైనే కేసు నమోదు
మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ నేత వెంకట ప్రసాద్ ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉంటే అతడిపైనే కేసు నమోదు చేయడం దారుణమని ఖండించారు. హత్యాయత్నానికి గురైన బాధితుడుపైనే తిరిగి పోలీసులు కేసు నమోదు చేయడం చూస్తే రెడ్ బుక్ రాజ్యాంగం ఎంత బలంగా పనిచేస్తుందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ హత్య జరిగిందంటూ వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు.

కక్షతోనే దాడి
మాజీ ఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

రాష్ట్రంలో నారా లోకేష్ ఆధ్వర్యంలో రెడ్ బుక్ రాజ్యాంగం పక్కాగా అమలు జరుగుతోందని, దాని డైరెక్షన్‌లోనే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ నేతలపై దాడులకు తెగబడుతున్నారని వినుకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో వెంకట ప్రసాద్ వైఎస్సార్ సీపీ ఏజెంట్‌గా పని చేశాడనే కక్షతోనే స్థానిక టీడీపీ గూండాలు ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల ప్రోద్బలంతో అతన్ని చంపేందుకు ప్రయత్నం చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే ఆకృత్యాలపై పోలీసులు న్యాయబద్ధంగా విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

కుందేరు ఆక్రమణలను సహించం



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాలటౌన్: కుందేరు ఆక్రమణలను తొలగించడంతోపాటు పూర్వపు స్థితి కొనసాగించేలా కృషి చేస్తున్నామని చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మంగళవారం చీరాల ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు ఆధ్వర్యాన కుందేరు పరిరక్షణ, కుందేరు ఆక్రమణలను తెలుసుకునేందుకు డివిజన్ స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో మురుగునీటిని కుందేరు ద్వారా స్ట్రయిట్ కట్ నుంచి సముద్రంలో కలిపేందుకు ముఖ్యమైన కుందేరు ఆక్రమణలకు గురవ్వడం, కుంచించుకుపోవడం దారుణమన్నారు. కుందేరుకు సంబంధించిన విస్తీర్ణం, వైశాల్యం, పొడవు, ఏయే ఊర్ల నుంచి ఎంత విస్తీర్ణం వ్యాప్తి చెందిందో పూర్తి వివరాలను అధికారులకు త్వరగా అందించాలన్నారు. ఆక్రమణలకు గురైన కుందేరును కాపాడుకోవడం కర్తవ్యమని, కుందేరును అభివృద్ధి చేస్తే రానున్న కాలంలో ఎలాంటి భారీ వర్షాలకైనా మురుగునీటి పారుదలకు ఇబ్బందులు ఉండవన్నారు. ఈపురుపాలెం, వేటపాలెం స్ట్రయిట్ కట్‌ల నుంచి కుందేరును మూసివేసి ఆక్రమణలకు పాల్పడ్డారని.. అలాంటి వారిని వదలబోమన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్లు కె.గోపికృష్ణ, జె.ప్రభాకరరావు, ఎంపీడీవోలు శివన్నారాయణ, రాజేష్, మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డ్రైనేజీ, ఇరిగేషన్, సర్వే ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వార్థానికి కూలుతున్న మహా వృక్షాలు



కొల్లూరులో కోసివేసిన పశ్చిమ బ్యాంక్ కెనాల్ అంచుల వెంబడి ఉన్న మహావృక్షం



భారీ వృక్షాలను కోసి తరలించగా కాలువ అంచుల వెంబడి మిగిలి ఉన్న కలప

కొల్లూరు: దశాబ్దాల చరిత్ర ఉన్న మహావృక్షాలు రంపపు కోతకు గురై నేలకొరిగాయి. కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ అంచుల వెంబడి పెరిగిన భారీ వృక్షాలు కొందరి స్వార్థానికి మనుగడ కోల్పోయాయి. కొల్లూరు-ఈపూరు మార్గంలో కాలువ అంచుల వెంబడి ఉన్న భారీ వృక్షాలలో ఓ వృక్షం ఇటీవల వీచిన పెనుగాలులకు కూలి కాలువలోకి వాలిపోయింది. ఆ వృక్షాన్ని తొలగించే పేరుతో సజీవంగా ఉన్న వృక్షాలను సైతం కోసి కలపగా మార్చి ట్రాక్టర్లలో తరలించడం విమర్శలకు దారితీస్తుంది. కూలిన వృక్షాన్ని తొలగించడానికి అయ్యే ఖర్చుల కోసం సజీవంగా ఉన్న వృక్షాలను కూల్చడానికి నీటిపారుదల శాఖ అధికారులు తెగించడంపై స్థానికంగా ఆగ్రహం వ్యక్తమవుతుంది. ఆహ్లాదకర వాతావరణాన్ని అందించే భారీ చెట్ల నరికివేతలో నగదు లావాదేవీలు భారీగా జరిగాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపు డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరుఎడ్యుకేషన్: డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ ఈనెల 28న గుంటూరులోని ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీల వారీగా జోన్ ఆఫ్ కన్సిడరేషన్‌లోకి వచ్చి, వ్యక్తిగతంగా డీఎస్సీ లాగిన్ ద్వారా కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు వాటిని డౌన్లోడ్ చేసుకుని, అందులోని సూచనలు పాటించాలని ఆమె సూచించారు. సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు హాజరయ్యే ముందుగా వెబ్‌సైట్‌లో వ్యక్తిగత డీఎస్సీ-2025 లాగిన్ ద్వారా అప్‌లోడ్ చేసుకుని, పరిశీలనకు హాజరుకావాలని తెలిపారు. విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు గెజిటెడ్ అధికారితో అటెస్ట్ చేయించిన మూడు సెట్ల ఫొటోస్టాట్ కాపీలు, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సామాజిక వర్గ ధ్రువీకరణ, వైకల్య నిర్ధారణ పత్రాలతో పాటు కాల్ లెటర్‌తో హాజరుకావాలని ఆమె సూచించారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి అరెస్టు

తెనాలి రూరల్: గంజాయి వినియోగంతో పాటు విక్రయిస్తున్న ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక బాలాజీరావుపేట కొబ్బరి చెట్ల వద్ద గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో త్రీ టౌన్ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడులు చేశారు. ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1,150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం వీడియో కలకలం

మహిళ చేతిలో మోసపోయానని, ఆత్మహత్యే శరణ్యమంటూ సెల్ఫీ వీడియో



ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్

మాచర్ల రూరల్: మాచర్ల రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ షరీఫ్ ఆత్మహత్యాయత్నం వీడియో మంగళవారం కలకలం సృష్టించింది. వీడియో వివరాలు ఇలాఉన్నాయి.. తన వద్ద ఓ మహిళ రూ. లక్ష, ఆ తరువాత రూ. 75వేలు తీసుకుందని, ఆ డబ్బులు తిరిగి చెల్లించమని అడిగితే ఆమె, ఆమె భర్త తన పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని వీడియోలో వాపోయాడు. తన భార్యకు అన్యాయం చేసి ఈ మహిళ విషయంలో సన్నిహితంగా ఉండి కుటుంబాన్ని దూరం చేసుకున్నానని సదరు కానిస్టేబుల్ వాపోయాడు. ఆ యువతితో తనకు వివాహేతర సంబంధం ఉందని, తమకు ఒక బిడ్డ కూడా ఉందని చెప్పాడు. పట్టణ శివారులోని ఎంఎస్ఆర్ టౌన్ షిప్‌లో నివాసముంటున్నామని వీడియోలో పేర్కొన్నాడు. తన తల్లిదండ్రులు ఇష్టం లేని పెళ్లి చేసి తన గొంతు కోశారంటూ మాయమాటలు చెప్పి ఆమె తనకు దగ్గరైనట్లు వీడియోలో వెల్లడించాడు. నగదు విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రావటంతో తనపై డీఎస్పీ, ఎస్పీలకు ఫిర్యాదు చేసిందని, ఈ నేపథ్యంలో తనకు ఆత్మహత్యే శరణ్యమని, తన చావుకు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న నా తల్లిదండ్రుల చావుకు కూడా వారిదే బాధ్యతని వాపోయాడు. తను చనిపోయాక తన శవాన్ని భార్య, పిల్లలు చూడాలని కోరాడు.

- ఈ వీడియో వైరల్ కావటంతో ఏఆర్ కానిస్టేబుల్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో తాళ్ళపల్లి, సాగర్ కుడి కాలువ వద్ద ఉన్న షరీఫ్‌ను రూరల్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. షరీఫ్‌పై సోమవారం నరసరావుపేటలో ఎస్పీ కార్యాలయంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో సదరు మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇరు వర్గాల ఫిర్యాదులను తీసుకొని పరిశీలిస్తున్నట్లు రూరల్ సీఐ షేక్ హఫీజ్ బాషా తెలిపారు.

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి
కలెక్టర్‌ను కోరిన ఏపీ సర్పంచుల సంఘం ముఖ్య సలహాదారు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

నరసరావుపేట: జిల్లాలో గ్రామ పంచాయతీలకు తొమ్మిది నెలల నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘ నిధులు, రిజిస్ట్రేషన్ సర్‌ఛార్జి నిధులను విడుదల చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘ ముఖ్యసలహాదారు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు విజ్ఞప్తి చేసారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. రిజిస్ట్రేషన్ సర్ చార్జి నిధులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యేవిధంగా కృషిచేయాలని, రిజిస్ట్రేషన్ ఐజీతో మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 526 గ్రామ పంచాయతీలలో రిజిస్ట్రేషన్ సర్‌చార్జి, 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తే సర్పంచులు, గ్రామ పంచాయతీలకు ఊరటగా ఉంటుందన్నారు. గ్రామాలలో నీటి సరఫరాకు, బ్లీచింగ్‌కు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు, విద్యుత్ బకాయిలు ఇచ్చేందుకు వెసులుబాటుగా ఉంటుందన్నారు. ప్రస్తుతం చాలా గ్రామ పంచాయతీల్లో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా బ్లీచింగ్ కొనేందుకు, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇచ్చేందుకు కూడా నిధులు లేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టి సారించి నిధులు విడుదలకు కృషిచేయాలని కోరారు. ఈ నిధులు విడుదల చేయకపోతే గత నెలలోనే కేంద్రం నుంచి రాష్ట్రంలోని స్థానిక సంస్థలకు రావలసిన రూ.1000కోట్లు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. దీనికి కలెక్టర్ స్పందించి సమస్యను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషిచేస్తానని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.

చెరువులో గల్లంతైన యువకుడు మృతి



గోపినాయక్ మృతదేహం

కొల్లూరు: చెరువులో పడి గల్లంతైన యువకుడి మృతదేహాన్ని గజ ఈతగాళ్ల సాయంతో పోలీసులు వెలికి తీయించారు. సోమవారం రాత్రి కొల్లూరు శివారు బోసనగర్‌లో సభావత్తు గోపినాయక్ (34) గ్రామాన్ని అనుకొని ఉన్న చెరువులో పడి గల్లంతైన విషయం విదితమే. అతని పెద్దమ్మ ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో చెరువులో పడిన వ్యక్తిని గమనించిన మహిళ స్థానికులను అప్రమత్తం చేసింది. స్థానికులు అతని కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో కొల్లూరు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సోమవారం రాత్రి గజ ఈతగాళ్లను చెరువులోకి దింపి గల్లంతైన యువకుడి కోసం గాలించారు. అర్ధరాత్రి సమయంలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ జానకి అమరవర్ధన్ తెలిపారు.

అక్రమ కేసులతో బీసీల అణచివేతకు కుట్ర

- కూటమి పాలనలో అన్ని వర్గాలకు అవస్థలు
- వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



నెహ్రూనగర్ (గుంటూరు ఈస్ట్) : కూటమి ఏడాదిన్నర పాలనలో బీసీలు అన్ని రకాలుగా అణచివేతకు గురవుతున్నారని..వారిపై అక్రమ కేసులు పెట్టి గొంతు నొక్కేయాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మండిపడ్డారు. గుంటూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణతో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో భాగంగా ఎంబుక్‌లో ఫోర్జరీ సంతకాలు చేశారని అభాండాలతో వైఎస్సార్ సీపీకి చెందిన పెదకాకాని ఎంపీపీ శ్రీనివాసరావుపై పొన్నూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించారని తెలిపారు. యాదవులు అంటే మంచితనానికి మారుపేరని..వారు మాట ఇచ్చారంటే దాని మీద నిలబడతారన్నారు. అటువంటి వారిపై అక్రమ కేసులు పెట్టి తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని సూచించారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రథమ స్థానం కల్పించి పైకి తీసుకువస్తే, కూటమి ప్రభుత్వం ఈవీఎంలతో అధికారంలోకి వచ్చి అక్రమ కేసులు పెట్టి వారిని అణగదొక్కాలని చూస్తోందని మండిపడ్డారు. ఎంపీపీ శ్రీనివాసరావు శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు చేయిస్తే దాన్ని కూల్చివేయించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల..అదే పొన్నూరు నియోజకవర్గం తక్కెళ్లపాడులో పెద్దఎత్తున వసూళ్లు చేసి శ్రీకృష్ణుడి రూపంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేశారని వివరించారు. దీన్ని తీవ్రంగా ఖండించిన తెలుగు రాష్ట్రాల్లోని యాదవులంతా ఏకమై హెచ్చరికలు చేశారన్నారు. అక్కడ విగ్రహాన్ని తొలగించి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. అరాచకంతో, అధికారం ఉందని ఏదైనా చేయగలమని చూస్తే ప్రజలు చూస్తు ఊరుకోరని కారుమూరి చెప్పారు. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీలపై ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినప్పటికి భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే అక్రమాలకు చెక్ పెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలిపారు.

ముగిసిన జిల్లా ఫెన్సింగ్ పోటీలు



జిల్లా ఫెన్సింగ్ పోటీలలో పతకాలు సాధించిన విజేతలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఉమ్మడి గుంటూరు జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల పోటీలు ముగిశాయి. జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభకనబరచిన వారిని ఈ నెల 30న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు పంపిస్తామని తెలిపారు. పోటీలను ఖేలో ఇండియా కోచ్ చిరంజీవి, డీఎస్ఏ కోచ్ కె.సంగీత బాబు ఆధ్వర్యంలో నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిష్టోఫర్, కోచ్‌లు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు నిరంతరం జరగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ

గుంటూరు వెస్ట్: జిల్లాలో రైతుల నుంచి పొగాకు కొనుగోలు ప్రక్రియ నిరంతరం జరగాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంతోపాటు, ప్రైవేటు కంపెనీలు కూడా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలో 3,895 మంది రైతులు పొగాకు సాగు చేయగా, 3,370 మంది రైతులు ప్రభుత్వానికి విక్రయించేందుకు సీఎం యాప్‌లో నమోదు చేసుకున్నారని జేసీ వెల్లడించారు. కొనుగోలు కోసం ఇప్పటి వరకు 1,614 మంది రైతులకు షెడ్యూల్ ఇచ్చారని తెలిపారు. ఏపీ మార్కెట్‌మార్క్‌ఫెడ్ ద్వారా 1063 మంది రైతుల నుంచి ప్రభుత్వం 2,200 టన్నులు కొనుగోలు చేసిందని చెప్పారు. ప్రైవేటు కంపెనీలు కూడా 3,500 టన్నులు కొనుగోలు చేశాయని తెలిపారు. ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన 2,800 టన్నుల పొగాకు సంబంధించి ఇప్పటికే షెడ్యూల్ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టి.నరసింహారెడ్డి, పొగాకు రైతులు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మారథాన్‌లో పతకాలు అభినందనీయం
జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



ఏఎస్ఐ, హోంగార్డుతో ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: అసాధారణమైన 42 కి.మీ మారథాన్ పరుగును కేవలం ఐదు గంటల్లోనే పూర్తి చేసి, పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసించారు. హైదరాబాద్‌లో ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ పరుగు పందెం (2025) పోటీలను ఈనెల 23, 24వ తేదీల్లో నిర్వహించారు. ఇందులో నల్లపాడు పీఎస్ ఏఎస్ఐ కె.రాజశేఖర్ బాబు (4.42 గంటలు), జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) హోంగార్డు జి.కృష్ణకిషోర్ (4.59 గంటలు) పతకాలు సాధించారు. నగరంపాలెంలోని డీపీఓలో మంగళవారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను ఏఎస్ఐ, హోంగార్డు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వారిద్దరిని అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో పతకాలు సాధించాలని సూచించారు.

చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

నగరంపాలెం: జిల్లాలో వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణపతి వేడుకలు, నిమజ్జనం కార్యక్రమాల్లో అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఉత్సవ నిర్వాహకులకు సూచించారు. జిల్లా ప్రజలకు సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో విఘ్నాలు తొలగిపోయి విజయాలు సిద్ధించాలని ఆయన తెలిపారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని ఎస్పీ ఆకాంక్షించారు.